www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 28 జులై 2023

5

కాకినాడ



'నవోదయ'లో క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవెల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక గురువారం ప్రారంభమైంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ నల్లా నరేంద్ర నాథ్ ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు శరీర ఆరోగ్యం, మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. నవోదయ ప్రిన్సిపల్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటి ఆర్.సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు శరత్ చంద్ర కీర్తి ప్రసంగించారు.

అధ్వానంగా రహదారులు

పలు మండలాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు భయాందోళనలకు లోనవుతున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలో ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతులు, బురదతో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. గండేపల్లి నుంచి సింగరంపాలెం వెళ్లే రహదారి పూర్తిగా గుంతలుగా మారింది. అటుగా వెళ్లాలంటే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇదే సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకోగా కొన్ని నెలల క్రితమే ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. తూతూ మంత్రంగా పనులు కానిచ్చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవం జరిగింది. ఆ ఆసుపత్రికి వెళ్లాలంటే ఇదే దారివెంట వెళ్లాలి. గర్భిణులు, వృద్ధులు, క్షతగాత్రులు అటుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రికి వెళ్లేందుకు మట్టితో రోడ్డు వేసినప్పటికీ వర్షాల వల్ల గోతులు పడి నీరు నిలిచిపోతోంది. మట్టికొరకంగా రోడ్డుమొత్తం బురదగా మారింది. మోటార్ సైకిల్ వెళ్లాలంటే జారిపోతున్నాయని ప్రయాణీకులు చెబుతున్నారు. దీనిపై డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ కొత్త రోడ్డు వల్ల ఈ విధంగా తయారైందని, విషయాన్ని సర్పంచ్‌కు, పాలకులకు, అధికారులకు తెలియజేశామని తెలిపారు.

జగ్గంపేట రూరల్ మండలంలోని రామవరంలో మర్రిపాక కాలనీలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఆ కాలనీలోకి ఏమైనా వాహనాలు వెళ్లాలంటే ముప్పు తిప్పలు పడాల్సిందే. చివరికి రేషన్ వాహనం కూడా ఆ కాలనీకి వెళ్లడం లేదు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ఆ కాలనీ రోడ్లన్నీ చెరువును కనిపిస్తున్నాయి. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయం వేస్తోందని కాలనీ వాసులు అంటున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా రోడ్డు వేస్తామని అంటున్నారు తప్ప వేయడం లేదని వాపోతున్నారు.

ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట-జె.అన్నవరం మధ్య ఆర్ అండ్ బి రహదారి శిధిలా వ్యవస్థకు చేరుకోవడంతో ఈ రోడ్డుపై ఎలా ప్రయాణించాని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి గుండా ఏజెన్సీ రాజవొమ్మంగి అడ్డతీగల వై.రామవరం మండలాల నుండి ప్రజలు వైజాగ్ కాకినాడ హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాలన్న ఈ రహదారిపై ప్రయాణించవలసిందే. ఈ రహదారిపై ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరిగి వాహనాలు పాడవడంతోపాటు అనేకమంది కాళ్లు చేతులు విరగగొట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. లక్ష్మీపురం, జె.అన్నవరం, మర్రివీడు గ్రామాల ప్రజలు అనునిత్యం ఇదే రహదారిపై ప్రయాణించాల్సి వస్తోంది. ప్రజా సంఘాలు రహదారిపై వరి నాట్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలపడంతో పాటు రహదారిపై అడ్డంగా గోడ కడతామని బహిరంగంగా హెచ్చరించారు.

మరమ్మతులు చేయాలి



జాతీయ రహదారిపై నుంచి సింగరంపాలెం వెళ్లే రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. బైకుపై వెళ్లాలంటే అప్రమత్తంగా లేకుంటే కనురెప్ప పాటులో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రి, పలు పాఠశాలలు ఇదే రోడ్డులో ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పెను ప్రమాదం చోటు చేసుకోకముందే మరమ్మతులు చేయాలి. చిన్నపాటి చినుకుకే చిత్తడిగా మారుతోంది. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- పెద్దిరాజు, గండేపల్లి



జగ్గంపేట రూరల్ రామవరంలో మర్రిపాక కాలనీలో రోడ్డు



ఏలేశ్వరంలోని జె.అన్నవరం రోడ్డు



గండేపల్లిలో సింగరంపాలెం రోడ్డు



ఐక్యత చాటుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

ఆగస్టు 9న విజయవాడలో మహా ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9 విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. స్థానిక టీచర్స్ హోమ్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, టిఎన్‌టియుసి నాయకులు రాజారావు, ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షుడు కష్టార్జున, ఐఎఫ్‌టియు నాయకులు మూర్తి అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబు, ఎఐటియుసి రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, ఐఎన్టీయూసీ ఏపీ అండ్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లూరి రాజు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, మధ్యాహ్న భోజన పథకం నేత నర్ల ఈశ్వరి, 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పెంకే రమణ, ఎఐబిఐ బ్యాంకు ఉద్యోగుల నాయకులు ఆదినారాయణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దడాల పద్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అన్నవరం, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ ఇజ్రాయిల్, మెడికల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రత్నరాజు, ఎపి ఎంఎస్ఆర్‌యు జిల్లా అధ్యక్షులు స్వామి, ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నేత రొంగల ఈశ్వరరావు, ఎఐటియుసి నాయకులు నరసరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత బొబ్బిలి శ్రీనివాసరావు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కెవి.రామయ్య, ఎఐటియుసి నేత పప్పు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేట్లపాలెం పంచాయతీలో రూ.3.46 కోట్ల అక్రమాలు

సర్పంచ్, మాజీ సర్పంచ్ సహా ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

వేట్లపాలెం పంచాయతీలో రూ.3.46 కోట్ల నిధుల అవకతవకలపై డిఎల్‌డిఒ ఫిర్యాదు మేరకు గురువారం సర్పంచ్ సిహెచ్.వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ వల్లూరి శేషవేణి, పిడబ్ల్యూడి ఆపరేటర్ మాన్యాల సత్యనారాయణపై కేసులు నమోదయ్యాయి. వేట్లపాలెం పంచాయతీలో గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోనూ భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్టు గ్రామానికి చెందిన కొందరు నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు, కలెక్టర్ స్పందనకు వరుస ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పలుమార్లు వేట్లపాలెం పంచాయతీలో డిపిఒ, డిఎల్‌డిఒ రికార్డులు తనిఖీ చేసి విచారణ జరిపారు. నిధుల వినియోగంలో అవకతవకలను గుర్తించారు. రూ.3.46 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు తేల్చారు. డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసును సిఐ కె.దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ విద్యా దీవెనతో ప్రతిభకు పట్టం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతిభకు పట్టం కట్టి ప్రపంచంలోనే టాప్ యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ఆర్థిక సహకారాన్ని నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్ నుంచి ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, సాంఘిక సంక్షేమ శాఖ జెడి డివి.రమణమూర్తి, ఇతర అధికారులు, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాలోని లబ్ధిదారుల తల్లిదండ్రులకు ఆర్థిక సహకారానికి సంబంధించిన మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో చదవగలిగే ప్రతిభ ఉండి కూడా ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా ఉన్న విద్యార్థులకు అండగా నిలబడి, విదేశీ విద్యకయ్యే ఫీజును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 21 విభాగాలకు సంబంధించి టాప్ 50 ర్యాంకులు సాధించిన యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి జరగుతోందన్నారు. గురువారం నాటి కార్యక్రమం ద్వారా కాకినాడ జిల్లాకు సంబంధించి మొత్తం 12 మంది విద్యార్థులకు రూ.2.06 కోట్ల మేర లబ్ధి చేకూరుతున్నట్లు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియ వివరించారు. ఈ కార్యక్రమంలో అనసూరి ప్రభాకర్, డి.లక్ష్మణ రావు, వివిధ ప్రాంతాల లబ్ధిదారులు హాజరయ్యారు.

రత్నగిరి షాపుల ద్వారా రూ.1.56 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.1.56 కోట్ల రికార్డు స్థాయి ఆదాయం లభించింది. కొండపైన గురువారం టోల్ గేట్ వేలానికి గతంలో నెలకు రూ.12 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ.23.38 లక్షలు, సెల్‌ఫోన్ కౌంటర్, ఓల్డ్ సిసి కాటేజ్ వద్ద కాఫీ స్టాల్‌కు వేలం నిర్వహించారు. వ్యాపారులు దేవస్థానానికి కట్టిన వేలం సొమ్ము అంతా అదనపు రేట్లు వసూలు చేసి తమ నుంచే దోపిడీ చేస్తారని ఈ సందర్భంగా పలువురు యాత్రికులు వ్యాఖ్యానిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోనని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు స్పష్టం చేశారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం ఆయన పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత 4వ సర్కిల్‌లోని దుమ్ములపేట, సంజయ్ నగర్ 1వ సర్కిల్లో కొండలపేటలో పర్యటించారు. పలుచోట్ల పారిశుధ్య పనుల్లో లోపాలను గుర్తించారు. దీనిపై ఆయన సిబ్బందిని హెచ్చరించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వేదాంసి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామానికి చెందిన యామల వేదాంసి అనే రెండేళ్ల చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించినట్లు చిన్నారి తండ్రి గజ్జన్న దొర తెలిపారు. 26 రకాల అంశాల్లో, కలాం ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి స్థానం సంపాదించుకుంది. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు.

ఎంఎల్‌ఎ చినరాజప్పకు అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర శాసనసభ ఎథిక్స్ కమిటీ సభ్యునిగా ఎంపికైన పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్పను గురువారం క్యాంపు కార్యాలయంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), రంధి సత్యనారాయణ, తూతిక రాజు, మొయిళ్ల కృష్ణమూర్తి, ఎలిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

మహిళల అదృశ్యంపై చట్టసభల్లో చర్చించాలి

ప్రజాశక్తి-కాకినాడ

దేశంలో బాలికల మహిళల మిస్సింగ్ కేసులు అధికం కావడం జాతి ప్రగతికి తీవ్ర ఆందోళనకర విషయమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై చట్ట సభల్లో వెంటనే విస్తృత చర్చ జరగాలన్నారు. మూడేళ్లుగా 13 లక్షల 12 వేల 878 మంది అపహరణకు గురవడం చిన్న విషయం కాదన్నారు. మహిళల అదృశ్యం భారత ప్రతిష్టకు తీవ్ర భంగకరమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్లుగా 13 వేల 784 బాలికలు 66 వేల 600 మహిళలు అదృశ్యం అవ్వడం తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోందన్నారు.

విద్యుదాఘాతంతో భవన కార్మికుని మృతి

కేసు రాజీ చేసిన పోలీసులు?

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రెండు ప్రభుత్వ శాఖల అలసత్వం ఒక కూలీ ప్రాణాన్ని బలిగొంది. రమణయ్యపేటలోని రాయుడుపాలెం-కొత్తూరు రహదారిలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల్లో సామర్లకోట హుస్సేన్‌పురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కె.ప్రసాద్ బుధవారం మరణించాడు. ఇనుప ఊచలు భవనం పైకి మోసుకొస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు ఊచలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. 33 కెవి విద్యుత్ లైన్లు నిర్మాణంలో ఉన్న భవనానికి అనుకుంటూ వెళ్లినప్పటికీ పంచాయతీ అధికారులు ఎలా ప్లాన్ ఇచ్చారో అర్థం కావడం లేదు. దీనికి అడ్డు చెప్పాల్సిన విద్యుత్ శాఖ అధికారులు భవన యజమాని ఇచ్చిన కాసులకు కక్కుర్తి పడి భవనానికి ఆనుకుని ఉండేలా మార్చడం మరో విషయం. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు సెటిల్మెంట్ చేశారని పలువురు తప్పు పట్టారు. రూ.15 లక్షల నష్టపరిహారం అడగ్గా భవన యజమాని ఎం.విజయ రాజు రూ.8 లక్షలు ఇస్తానని చెప్పడంతో పోలీసులు మాట్లాడి సెటిల్ చేసినట్టు సమాచారం. విద్యుత్ తీగల పక్కన అనుమతులు ఇచ్చిన పంచాయతీ అధికారులు, విద్యుత్ అధికారులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సంఘటనా స్థలానికి రాకపోవడం విశేషం. కార్మికుని మరణానికి కారుకులైన వారిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

పర్మినెంట్ చేయాలని కార్మికులు, ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు, మున్సిపల్ వర్కర్స్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చాలా అభినందనీయమన్నారు. ఏళ్ల తరబడి ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందిస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేసి ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఈ లోపు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సిపిఎస్ రద్దు చేయాలని, బకాయి ఉన్న సరెండర్ లీవులు, డిఎలు చెల్లించాలన్నారు. క్లాప్ డ్రైవర్‌లకు జిఒ నెంబర్ 7 ప్రకారం రూ.18,500 జీతం చెల్లించాలని, వారాంతపు సెలవులు క్యాజువల్ లీవులు అమలు చేయాలన్నారు. శానిటేషన్ వాహనాలు నడుపుతున్న ఆప్కోస్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్సు ఇప్పించాలన్నారు. జీతంతో పాటే హెల్త్ అలవెన్స్ చెల్లించాలన్నారు. స్పెషల్ శానిటేషన్ వర్కర్స్‌ను ఆప్కోస్‌లో చేర్చాలన్నారు. వాటర్ వర్క్స్, పార్కులు, స్కూల్స్, సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జిఒ ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు ఇప్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా యూనిఫాం, సబ్బులు, చెప్పులు, టవల్స్, నూనె తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ మేడిశెట్టి వెంకట రమణ మాట్లాడారు. అనంతరం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నాగనరసింహారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బంగారు సత్తిబాబు, జలగడుగుల శ్రీనివాస్, మందపల్లి సూర్య ప్రకాష్, యరంశెట్టి నాగబాబు, వర్రే రమణ, సత్యనారాయణ, సింహాచలం, సత్యేంద్ర, చిరంజీవి, రాజు, శ్రీను, లక్ష్మి, నాగమణి, శ్యామల, దుర్గ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సఫాయి కర్మచారీ నాయకులు బండి లక్ష్మీనారాయణ సంఘీభావం తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సొసైటీలో రుణాల అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్ , కిర్లంపూడి

కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బినామీల పేరుతో రూ.కోట్ల రుణాలు గోల్ మాల్ చేసిన విషయమై అధికారులు విచారణ చేపట్టారు. ఈ పిఎసిఎస్ పరిధిలో 2012 నుంచి 2022 మధ్య కాలంలో రూ.85 కోట్ల కుంభకోణం జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ సొసైటీలో వేలంక, సింహాద్రిపురం, కిర్లంపూడి, సిరిపురం, తదితర గ్రామాల పరిధిలోని 4 వేల మంది రైతులు ఉన్నారు. ఈ పదేళ్లలో రూ.200 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. 2006లో అప్పటి ప్రభుత్వ నిర్ణయంతో రూ.150 కోట్లకు పైగా రుణాలు మాఫీ అయ్యాయి. ఆ తర్వాత పునరుద్ధరించిన రుణాలు రూ.కోట్లలో ఉన్నాయి. వీటిలో సరైన పత్రాలు లేకుండా రుణాలు పొందడం వెనుక కొందరు నాయకులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొసైటీ రుణాల్లో వసూలు చేసిన కొంత మొత్తం కూడా నగదు పుస్తకాల్లో నమోదు చేయలేదనే అనుమానంతో ఆరా తీస్తే తీగలాగితే డొంక కదిలినట్లుగా అంతా బయటకు వచ్చింది. సరైన పత్రాలు, సెక్యూరిటీ లేకుండా రుణాలు మంజూరుచే శారని అధికారులు తేల్చారు. అలాగే రూ.85 లక్షల నిధులు సైతం గోల్ మాల్ అయినట్లు ప్రత్తిపాడు బ్రాంచ్ సూపర్‌వైజర్ ఎ.కొండ బాబు గుర్తించి ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై డిసిసిబి సిఇఒ నరసింహారావు కలెక్టర్ కృతికాశుక్లాకు నివేదించడంతో కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇచ్చారు. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి పద్మ గురువారం కిర్లంపూడి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌ను సందర్శించి వివరాలను, ఆ రుణాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందని ఆమె తెలిపారు.

గ్రంథాలయ పిత 'అయ్యంకి'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం కృషి సలిపి గ్రంథాలయ పితామహుడిగా వినతికెక్కిన అయ్యంకి వెంకట రమణయ్య స్ఫూర్తి ఎనలేనిదని గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన 1890 జూలై 24న మన జిల్లాలో కొంకుదురు గ్రామంలో జన్మించారని అన్నారు. మనదేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా ఆయన పేరు గాంచారన్నారు. దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని ఆయన స్థాపించారని అన్నారు. గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి ప్రజలను చైతన్యవంతం చేశారని అన్నారు. 1972లో ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించిందని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్


రామవరంలో మాజీ సర్పంచ్ మండపాక నాగమణి భర్త వెంకటాచలం తన అనుచరులతో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. నెహ్రూ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నెహ్రూ మాట్లాడుతూ రామవరంలో మంచి పట్టు ఉన్న కుటుంబం అని, రాజకీయంగా సేవా పరంగా గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. గతంలో తమలో కలిసి వారు పని చేశారని గుర్తు చేశారు. వైసిపి అరాచక పాలన వల్ల టిడిపిలో చేరారన్నారు. టిడిపిలో ఉన్న ప్రతి ఒక్కరికీ రాబోయే ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తొలుత నెహ్రూ, నవీన్ కుమార్‌ను గజ మాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, మారిశెట్టి భద్రం, ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, వేములకొండ జోగారావు, మండపాక అప్పన్న దొర, రాపర్తి సీతారామయ్య, బోండా రాజేష్, మండపాక వెంకటేశ్వరరావు, దాట్ల రమేష్, దాట్ల సుబ్బరాజు, మండపాక శ్రీనుబాబు, మండపాక పాపారావు, అడబాల సూరిబాబు, అడబాల సత్యనారాయణ, మండపాక పెద్ద పాల్గొన్నారు.

కాల్వలో తూటు తొలగింపు

ప్రజాశక్తి-పెదపూడి

మండలంలో గొల్లల మామిడాడలో ఇటీవల కురిసిన బారీ వర్షాలకు పైనుండి వచ్చిన తూటుకాడతో తుల్యభాగ మొత్తం నిండిపోయింది. దీంతో లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య ఆధ్వర్యాన, పంచాయతీ సహకారంతో తూటుకాడ తొలగించారు. ఈ సందర్భంగా మండ రాజా రెడ్డి మాట్లాడుతూ రాబోయే శ్రావణమాసం సందర్భంగా గంగపూజలు, నదీస్నానాలకు వీలుగా తుల్యభాగను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరాఘవ రెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, పాతూరి అప్పారావు, రాయుడు వీరరాఘవులు, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





ఆదిత్యలో కలాంకు నివాళి

కలాం జీవితం ఆదర్శనీయం

మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం పలుచోట్ల ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏలేశ్వరం ఎంఇఒ కార్యాలయ ఆవరణలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఇఒ బి.అబ్బాయి, మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత అడపా దుర్గారావు, కోరాడ రాజు, ఎస్.దుర్గాప్రసాద్, కె.నవీన్, అమరేశ్వరి, సత్యవేణి, రత్నకుమారి, దీపిక ఉన్నారు. **గండేపల్లి** ఆదిత్య విద్యా ప్రాంగణంలోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్. కుమార్, పాలిటెక్నిక్ డీన్ ఎ.మాధవరావు మాట్లాడారు. **కాకినాడ రూరల్** సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళి అర్పించారు. ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



చెల్లా చెదురుగా పడిన క్షతగాత్రులు

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి వద్ద జాతీయ రహదారి 216 పై గురువారం మధ్యాహ్నం దుర్గా వాస్తు నిలయం సమీపంలో రెండు బైకులు ఢీకొని ఒక వ్యక్తి మతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి యానాం వైపు, యానాం నుంచి కాకినాడ వైపు వస్తున్న రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైకులపై ఉన్న నలుగురు వ్యక్తులు రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయారు. ఈ సంఘటనలో కాకినాడ ఏటిమొగ తూర్పు పేట హనుమాన్ టెంపుల్ ప్రాంతానికి చెందిన మల్లాడి సత్తిబాబు (36) మరణించినట్లు తెలిపారు. సత్తిబాబుకు భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కర్రి ధనశేఖర్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను పోలీసులు 108 లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కోరంగి ఎస్.ఐ.పి.శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామంలో రేవతి అనుమాన స్థితిలో అదృశ్యమైనట్టు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన లలితా దేవి మురారి గ్రామంలోని హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెను అదే గ్రామానికి చెందిన భువనగిరి కిరణ్ కుమార్ ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఆమెను బ్లాక్ మెయిల్ చేసి తీసుకుని వెళ్ళిపోయినట్టు ఆమె తల్లి వీరవేణి ఇచ్చిన ఫిర్యాదుపై ఎఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా బట్టీపై ఎక్సైజ్ అధికారుల దాడి

ప్రజాశక్తి-గోపాలపురం

225 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, 2800 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సిఐ డి.సుధా తెలిపారు. భీమోలు గ్రామంలో నాటు సారా బట్టీపై దాడి చేసినట్టు తెలిపారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కొవ్వూరు కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్క్మిలు పి.సుధీర్, ఎం.రామ శేషయ్య, విఆర్ఒ సూర్యారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సికి వైద్య పరికరాల అందజేత

ప్రజాశక్తి-అన్నవరం, తొండంగి

మండలంలోని ఎవి.నగరం పిహెచ్‌సికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ గురువారం వైద్య పరికరాలు అందించింది. తమ సామజిక బాధ్యతలో భాగంగా రూ.లక్షా 50 వేల విలువైన వైద్య పరికరాలు సర్జికల్ బీన్స్, ఇన్‌స్టుమెంటల్ ట్రాలీలు, ఇఎన్‌టి హెడ్ లైట్, ఓటోస్కోప్ లాంటి వైద్యపరికరాలు ఆసుపత్రి వైద్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, ఆరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు హాస్పిటల్ వైదులు డాక్టర్ భారతి, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. వైద్యపరికరాలు అందించిన ఆరబిందో ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, పి.శరత్ చంద్రారెడ్డికి కొయ్య మురళి కృతజ్ఞతలు తెలిపారు.

విప్లవకారిణి కల్పనా దత్త

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్వాతంత్ర ఉద్యమంలో మహిళా విప్లవకారుల్లో అగ్రగామిగా కల్పనా దత్త గుర్తింపబడ్డారని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కల్పనా దత్త జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1913 జూలై 27న జన్మించిన కల్పనా దత్త స్వాతంత్ర ఉద్యమ సమయంలో ఇండియన్ రిపబ్లిక్ ఆర్మీలో చేరి విప్లవకారిణిగా చురుకుగా పాల్గొన్నారన్నారు. చిట్ట గ్యాంగ్‌లోని యూరోపియన్ క్లబ్ పై దాడి చేసే సమయంలో నిఘా వర్గాలకు దొరకడంతో ఆమె అరెస్టయ్యారన్నారు. బెంగాల్ కరువు సమయంలో, విభజన సమయంలో ఒక కార్యకర్తగా విశేష సేవలు అందించారని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,రాజా తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

అయోధ్యరామపురంలోని 24వ వార్డులో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వార్డు ప్రజలు గురువారం వినతిపత్రం అందజేశారు. గురువారం వార్డు కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన పలువురు ప్రజలు కమిషనర్‌ను కలిశారు. వార్డులో నివాసాల మధ్య గతంలో నిర్మించిన పబ్లిక్ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రాత్రి సమయాల్లో అవి అసాంఘిక కార్యక్రమాలకు నిలయా లుగా మారుతున్నాయన్నారు. మరుగుదొడ్ల నుచి విపరీతమైన దుర్గంధం వెదజల్లు తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటు న్నారని కమిషనర్‌కు వివరించారు.

గాడిమొగ పిహెచ్‌సి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- తాళ్లరేవు

గాడిమొగ పిహెచ్‌సి అభివృద్ధికి ఎంఎల్‌ఎ సతీష్ కుమార్, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేయనున్నట్లు ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. గురువారం గాడిమొగ పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశంలో సునీత మాట్లాడారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులపై వైద్యులు దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యురాలు జయ భార్గవి, ఆసుపత్రి సూపర్‌వైజర్ ఇబ్రహీం మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, రాయుడు గంగాధర్, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఫైలేరియా నివారణకు కృషి చేస్తున్నట్టు ఫైలేరియా కేంద్రం హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబాబు తెలిపారు. గురువారం స్థానిక ఫైలేరియా కేంద్రంలో రోగులకు ఆయన ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం వివిధ గ్రామాల నుంచి సుమారు 100 మంది ఫైలేరియా రోగులు ఈ కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఇటీవల స్థానిక శంకరయ్యపేటలో ఫైలేరియా గుర్తింపునకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించగా ఫైలేరియా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత వాతావరణంలో డెంగ్యూ రోగులు పెరిగే అవకాశం ఉన్నందున దోమల నివారణకు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జీవన్ కుమార్ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు ప్రారంభించారన్నారు. ప్రతి నెలా మొదటి వారంలో మూడు రోజులు పాటు వెనుకబడిన ప్రాంతాలలో బోదవ్యాధి గుర్తింపునకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. బోధ వ్యాధి నివారణకు అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్పొరేట్లకు భూముల అప్పగింత అన్యాయం

ప్రజాశక్తి- రౌతులపూడి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అన్యాయమని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు బుగతా బంగారాజు అన్నారు. గురువారం రౌతులపూడి పద్మనాభ కమిటీ హాల్లో భూమి సమస్య ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో భూ సంస్కరణలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక పెట్టిన పెట్టుబడులు రాక నష్టపోతున్నారని తెలిపారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో ల్యాండ్ సీలింగ్ భూముల గురించి మాట్లాడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నారాయణమూర్తి, సింహాచలం, రత్నం, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

కాలేజీ హాస్టల్‌కు ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి-పిఠాపురం

ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా బిసి వెల్ఫేర్ కళాశాల హాస్టల్‌కు గురువారం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఐదు సీలింగ్ ఫ్యాన్లను హాస్టల్ వార్డెన్ వై.కమలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, మెహబూబ్ పాషా, హుస్సేన్ షా పీఠం కన్వీనర్ శ్రీ పేరూరి సూరిబాబు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ



కరపత్రాలు పంచుతున్న పావని

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సులో ప్రయాణించే వారికి టిడిపి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1,500 ఇవ్వడం మహిళలకు ఎంతో మనోధైర్యం కలిగిస్తుందన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేల ఇవ్వడం వల్ల తల్లితండ్రులపై భారం తగ్గి ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందని సుంకర పావని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో అనేక మార్లు పెరిగిన బస్సు ఛార్జీలు సాధారణ మహిళలకు పెనుభారంగా మారిన తరుణంలో ఉచిత బస్సు ప్రయాణం పథకం మహిళలకు ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు


సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. వచ్చే నెల 10 నుంచి సమ్మెకు దిగుతామని ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.బాల కుమార్ పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఉద్యోగులు, కార్మికులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అనేక మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎన్.ఆదినారాయణరావు, వై శ్రీనివాసరావు, జివిఎల్.శ్రీనివాస్, ఎల్.గంగాధరరావు, జి.శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు.

ఆదిత్యలో హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి-గండేపల్లి



మందులు పంపిణీ చేస్తున్న సభ్యులు

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్‌లో శారదా రామకృష్ణ సమితి సభ్యులు గురువారం హోమియో మందులు పంపిణీ చేశారు. కంటి కలకల నివారణకు వీటిని పంపిణీ చేశారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్, సమితి గౌరవ సభ్యుడు డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సభ్యుడు పెనుమల్లు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ గిరి ప్రసాద్, జి.ప్రకాశరావు, బొడ్డు చిట్టిబాబు, జి.వెంకటేష్, టి.శ్రీనివాస్, ఎన్.ప్రసాద్, ఎ.నాగదేవి, ముంగి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానం-2020 ద్వారా సత్ఫలితాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రధాని మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 2020 విద్యా విధానం ద్వారా ఈ రంగంలో విప్లవత్మకైనా మార్పులు వచ్చి విద్యార్థులు మరింత నాణ్యమైన విద్యను అందుకుంటున్నారని కాకినాడ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బొంతా శేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా విద్య సులభంగా, సరళతరంగా బోధించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు వివిధ విధాలుగా విద్యను విభజించి పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజ పౌరులుగా తీర్చడానికి ఈ విధానం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంతకుముందు ఉన్న పది ప్లస్ టు విధానాన్ని ఐదు భాగాలుగా విభజించి ఈ విద్యను అందిస్తున్నామని శేఖర్ తెలిపారు. అందులో భాగంగా ఒకటి నుంచి రెండో క్లాస్ వరకు ఫౌండేషన్ స్టేజ్, మూడు నాలుగు ఐదు తరగతులకు ప్రిపరేషన్ స్టేజి, 6, 7, 8 తరగతులకు మిడిల్ స్టేజి అని ఆ తర్వాత 9, 10, 11, 12 క్లాసులకు సెకండరీ స్టేజిగా విభజించి పాఠ్యాంశాలు నేర్పుతున్నామని తెలిపారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ కాలపరిమితి, ఒక సంవత్సరం పీజీ విద్య ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆదిరెడ్డి రాజు, ఎంఇఒ ఎన్.ఏసుదాసు, ప్రిన్సిపల్ డాక్టర్ ది అగస్టస్ పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం పాఠశాల ఆవరణలో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది మొక్కలు నాటారు.

యానాం వార్తలు

ఎంఎల్‌ఎను కలిసిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి -యానాం

యానాం నూతన మున్సిపల్ కమిషనర్ ఆర్.అరుణ్ ప్రకాశం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువాతో సత్కరించారు. అనంతరం మున్సిపాలిటీకి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది నూతన కమిషనర్ అరుణ్ ప్రకాశంకు ఘన స్వాగతం పలికారు.

మణిపూర్ ఘటనపై నిరసనలు

ప్రజాశక్తి - యానాం

మణిపూర్ మహిళలపై జరుగుతున్న దారుణమైన హింసలపై మోడీ మౌనం వీడాలని స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద రాజ్యాంగ పరిరక్షణ వేదిక, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ దాట్ల దేవదానం రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవివి.సత్యనారాయణ, గిడ్డి బైరమూర్తి, సాపే దుర్గారావు, కె.సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, జి.ప్రహ్లాదుడు, రాజేంద్రప్రసాద్, అన్నెం శీనుబాబు, సలాది నాగబాబు, పెయ్యల వెంకటేశ్వరరావు, యదాల శ్రీనివాస్ పాల్గొన్నారు. తాళ్లరేవు, యానాం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారుల గుండా ర్యాలీని కొనసాగించారు. అనంతరం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

యుడిసి పరీక్షలో 10 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పాలనాసంస్కరణల విభాగం నిర్వహించిన యుడిసి పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. మొత్తం 116 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలో యానాం నుంచి రికార్డు స్థాయిలో 10 మంది ఉత్తీర్ణత సాధించారు. యానాంలో విఎస్ఎస్ఎం లోవరాజు కనకాల, పేరాబత్తు వీరబాబు, మొహమ్మద్ షారుక్, రాజు దేవన, నక్కా చైతన్య, సాయికష్ణ బందకవి, దంగుడుబియ్యం వీర నాగలక్ష్మి, సాయి సీత సలాది, యువ సుబ్రహ్మణ్య మహేష్ ఆచంట, అరుణ ఎస్లావత్ ఎంపికయ్యారని ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఎల్.కుమార్ ప్రకటించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎంఎల్‌ఎ అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. కోచింగ్ అందించిన శ్రీనివాస కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని అభినందించారు.

పేద విద్యార్థుల కోసమే 'జగనన్న విదేశీ విద్యా దీవెన'

ప్రజాశక్తి-అమలాపురం

ప్రఖ్యాతి గాంచిన విదేశీ విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువుల కొరకు సీట్లు పొంది ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా తెలిపారు గురువారం సిఎం జగన్ జగనన్న విదేశీ విద్యా దీవెన రెండో విడత నిధులను విద్యార్థినీ విద్యార్థులకు బటన్ నొక్కిజమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, పి.గన్నవరం ఎంఎల్‌ఎ కె.చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాలమునికుమారి తదితరులు జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులపై ఆసక్తి ఉన్న విద్యార్థులను అంత ర్జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది చదువుల్లో నాణ్యత పెంపొందించి ప్రపంచంతో పోటీ పడేలా ఈ పథకం ద్వారా సదవకాశాన్ని కల్పించిందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇద్దరు విద్యార్థు లు విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వి.జ్యోతిలక్ష్మి దేవి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొ న్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు: మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఇంటి వద్దకే అందజేస్తున్నామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం వెంకటాయ పాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా వినూత్నంగా జరుగుతున్న ఈ కార్యక్రమంతో పౌరులు తమకు కావలసిన ధృవపత్రాలను ఇంటివద్దె అందుకుం టున్నారని 11 రకాల సేవలు తక్షణం అవసరమైన వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మండల ఎంపిపి అంబటి భవాని, జెడ్‌పిటిసి సభ్యుడు మెర్నిడి వెంకటేశ్వరరావు, ఎపి ఇండస్ట్రియల్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వెంకటా యపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి, ఎంపిడిఒ సలట్ రాజు, వైస్ ఎంపిపి నరాల రాజ్యలక్ష్మి స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓగూరికి మంత్రి విశ్వరూప్ అభినందన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షునిగా నియమితులైన గోపవరానికి చెందిన పార్టీ నాయకుడు ఓగూరి విజయ్ కుమార్ ను గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆయన తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్‌లు అభినందించారు. పార్టీ బలోపేతానికి కషి చేయాలని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సచివాలయాల మండల కన్వీనర్ కోటుం లోవరాజు,పార్టీ నాయకులు ఉన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్‌లో పదవి స్వీకరించలేదు: జగన్నాథ వర్మ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ఎటువంటి పదవిని స్వీకరించలేదని పట్టణంలోనే ఆటోస్ ఫ్యాక్టరీ అధినేత అడ్డూరి జగన్నాథ వర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామ్రావ్ కామర్స్ గౌరవాధ్యక్షునిగా ఆయనను ఎన్నుకున్నా ఆ పదవిని తాను స్వీకరించలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్నానని చాంబర్ ఆఫ్ కామర్స్ విడుదల చేస్తున్న ప్రకటనల్లో ఆరోపణల విషయంలో ఏ విధంగాను స్పందించలేదని దీనిని గమనించాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఆలమూరు

ఇటీవల జార్జియా దేశంలో ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థి సిడిగం హేమంత్ అశ్విన్ ఆకాష్ ఈ నెల 16న అదశ్యంమయ్యాడు. అయితే జార్జియా దేశంలో జరిగిన దర్యాప్తులో కుమారుడు మరణించినట్లు సమాచారం ఆలమూరు పిఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సిడిగం సత్యనారాయణ (నాయుడు)కు తెలిసింది. ఈ వార్తతతో కలత చెందుతున్న ఆయనను గురువారం కొత్తపేట నియోజక వర్గ జనసేన ఇంచార్జీ బండారు శ్రీనివాస్ జనసైనికులతో కలసి ఓదార్చారు. ఈ సందర్భంగా హెచ్‌సి నాయుడు తన కుమారుడు మతిపై వివరాలు తెలిపారు. హెచ్‌సి పరామర్శించిన వారిలో జనసేన నేతలు తాళ్ల డేవిడ్, మహాదశలు బాబులు, చల్లా బాబి, చల్లా వెంకటేశ్వరరావు, సిరిగినీడి పట్టాభి, కట్ట రాజు, దాస్ మోహన్, తదితరులు ఉన్నారు.

'దిశా' పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం భాష్యం పాఠశాల నందు దిశ డిఎస్‌పి మురళీమోహన్ ఆధ్వర్యంలో దిశ చట్టం పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కనకదుర్గ, సిబ్బంది, దిశ యాప్ అవగాహన సదస్సు తదితర విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాల జోనల్ ప్రిన్సిపల్ వల్లూరు గోవిందరాజులు, స్థానిక ప్రిన్సిపల్ భాస్కర్, ఛాన్స్ ప్రిన్సిపల్ జి.శాంతి, దిశ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎఎ-23 బిల్లు రద్దుకు డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు-2023పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక సన్నకారు మత్స్య కారులను పరిగణ లోకి తీసుకోకుండా రూపొందించారని, దీనిని వెంటనే రద్దు చేయాలని నేషనల్ ప్లాట్ ఫారం స్మాల్ స్కేల్ ఫిష్ వర్కర్స్ సొసైటీ రాష్ట్ర నాయకులు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. సంప్రదాయ సన్నకారు మత్స్య కారుల జాతీయ వేదిక తరపున తీవ్రంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటరీ నివేదిక పర్యావరణానికి హానికరం కలిగించేలా వున్న సిఎఎ-2023(సవరణ) బిల్లుని ఆమోదించేలా ఉండటమే కాకుండా, సన్నకారు మత్స్య కారుల జీవనోపాధి, పర్యావరణ, సమతుల్యత, సమాజానికి మంచి నీటి కొరత వంటి వాటిపై తీవ్రంగా ప్రభవితం చేసి పూర్తిగా నష్టం కలిగించేలా వున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నివేదిక (కోస్టల్ రెగులేషన్ జోన్) మండలాల పరిధి దాటి ప్రాదేశిక జలాల వరకు అన్ని రకాల ఆక్వా సాగుతో పాటు తీవ్రమైన రొయ్యల సాగు వాటి సంభంది త పరిశ్రమలనూ మరింత విస్తరించేందుకు మార్గం సుగమం చేసే విధంగా ఉన్నదని వివరించారు. ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని స్వర్ణకారు మత్స్యకారుల సంఘం డిమాండ్ చేసింది.

'మహాసభ' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-అయినవిల్లి

తొత్తరమూడలో హలో మాదిగ చలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పి. గన్నవరం నియోజకవర్గం(యంయస్‌పి)మహాజన సోషలిస్టు పార్టీ ఇంచార్జ్ నేదునూరి వెంకట్రావు నాని అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఎ,బి,సి,డి వర్గీకరణ రిజర్వేషన్ల కోసం కేంద్రం ఈ పార్లమెంటు సమావేశంలో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో విశ్వరూప మహాసభను నిర్వహిస్తారన్నారు. ఆగస్టు రెండో వారంలో జరగబోయే బహిరంగ సభలో ప్రతి మాదిగ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కో ఇంచార్జ్ రవీంద్రబాబు, అయినవిల్లి మండలం మహాజన సోషలిస్టు పార్టీ ప్రెసిడెంట్ కోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.